04022024-MAI-04_Layout 1 2/4/2024 2:58 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథలా నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

# అవధాన వికాసం జరిగింది ఇట్లా!

**అవధానం ఎట్లా పుట్టింది? కాలక్రమంలో ఎలాంటి మార్పులు చెందింది? పూర్తిస్థాయి సాహిత్య ప్రక్రియగా ఎలా అవతరించింది? అష్టావధాన, శతావధానంగా ఎలా వికాసం చెందింది? అనే అంశాలను ప్రముఖ శతావధాని ఆముదాల మురళి విశ్లేషించారు. దర్శనం ఆధ్యాత్మిక మాసపత్రిక 19వ వార్షికోత్సవంలో ఆయన ప్రసంగ సారాంశమిది.**




18వ శతాబ్దంలో అవధానం ఆరంభమైంది. అంతకు ముందు కూడా అవధానం అనేటటువంటి పదం ఉంది. అవధానాలు ఉన్నాయి. అవధానం అనేది పూర్తిగా వేదానికి సంబంధించినటువంటిది. వేదాన్ని కంఠస్థం చేసే పాట పద్ధతుల్లో క్రమ, జంట, గణ మొదలైనవి ఉన్నాయి. ఆ విధంగా వేదాన్ని కంఠస్థం చేసే వాళ్లను అవధానులు అని వ్యవహరించే సంప్రదాయం మనకు ఉన్నది. అందుకే ఇప్పటికీ చాలామంది ఇంటిపేర్లు అవధానం అని ఉంటుంది లేదా పేరు తరువాత అవధాని అని ఉండే వాళ్లు వేదపండితుల్లో కనిపిస్తారు. అట్లాంటి అవధానం సాహిత్యంలోకి ప్రవేశించింది. చెరిగొండ ధర్మన, రామరాజభూషణుడు, కోలాచల మల్లినాథ సూరి మొదలైనవాళ్లు అవధానాలు చేసినట్టు మనకు తెలుస్తున్నది. అయితే వాళ్ల అవధానాల తీరుతెన్నులు ఎలాంటివో, వాళ్లు ఏఏ అంశాలు స్వీకరించారనేది ఇదమిత్థంగా తెలియడం లేదు. భారతదేశంలో 18వ శతాబ్దం వరకూ అనేక స్వతంత్ర రాజ్యాలు ఉండేవి. కాలక్రమంలో ఈస్ట్ ఇండియా కంపెనీలో మెల్లమెల్లగా అవి అంతర్భాగమైపోయాయి. కంపెనీ పాలనను ఎదిరించడానికి కొంతమంది ప్రయత్నం చేశారు. కొంతమంది జమీందార్లు ఎదిరించలేక వాళ్లకు కప్పం కడుతూ నామమాత్రపు అధికారంతో మిగిలిపోయారు. అయినా వాళ్ల దాస్య లక్షణం పోలేదు. అదేవిధంగా భోగలాలసత పోలేదు. అధికార తృష్ణ పోలేదు. ఆ సందర్భంలో వాళ్లు ఎలాగైనా సరే తమ అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి రకరకాలైన ప్రయత్నాలు చేశారు. కొంతమంది మహాకావ్యాలు రాయించి అంకితం తీసుకునే సంప్రదాయాన్ని కొనసాగించారు. సంస్థానాధీశుల వద్ద 17, 18వ శతాబ్దాలలో ఉండే కవులందరూ చిత్ర కవిత్వంపై, బంధ కవిత్వంపై, గర్భ కవిత్వంపై ఎక్కువగా దృష్టిని నిలపడంతో చెరకుగడలాంటి తెలుగు కావ్యం కాస్త వెదురుగడలాగా తయారైంది. ఆ వెదురు గడలను ఆస్వాదించే పరిస్థితి సాధ్యం కాక మెల్లగా కవిత్వం సామాన్యులకు కొంచెం దూరంగా జరిగింది.

> జమీందార్ల వద్ద ఉండే పండితులు, ఆ పండిత సభల్లో చెప్పే కవిత్వం కేవలం కాలక్షేపానికి చెందిన అంశంగా మారిపోయింది. కాలక్షేపం అన్నప్పుడు, ఆసక్తిగా ఉంటే బాగుంటుందని మెల్లమెల్లగా సమస్యాపూరణం లాంటివి మొదలయ్యాయి సంస్థానాల్లో. జమీందారీ యుగంలో ఆశుకవిత్వం వల్ల, అవధానాల వల్ల, కవుల దేశాటనం వల్ల, తెలుగు కవిత్వంలో ఒక రకమైనటువంటి ఏకత మొదలైందని దీని గురించి ఆరుద్ర చెప్పారు.

ఆ ఏకత ఏమిటంటే, అవధానాలు, ఆశు కవిత్వాలు ప్రదర్శనకు యోగ్యంగా మారడం, అవి వేదికలెక్కడం, ఆ వేదికల మీద ఆశు కవితా ప్రదర్శనలు జరగడం, సభల్లో సమస్యలు ఇవ్వడం, వాటిని పూరణ చేయడం! ఇది ఒక కాలక్షేపంగా, పాండిత్య ప్రకర్షగా కూడా మారింది. ఒక జమీందారు చేసిన తర్వాత ఇంకో జమీందారు తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం 'మా ఆస్థానంలో కూడా చేయండి' అని అవధానాలు చేసే వాళ్లను పిలవడం ద్వారా ఒక రకంగా కవిత్వానికి, అవధానానికి, ఆశువునకు మంచి రోజులు వచ్చాయి.

ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఎప్పుడైనా సరే ఆర్థిక కారణాల వల్ల మనిషిలో భావ పరివర్తన వస్తూ ఉంటుంది. డబ్బు గురించి డబ్బు లేని వాడు, సంపాదించని వాడు ఒక రకమైన భావం చెప్తాడు. డబ్బు ఉన్న వాడు.. డబ్బు గురించి చెప్పే మాట వేరుగా ఉంటుంది. ఆర్థిక కారణాల వల్ల మనిషిలో భావ పరివర్తన మొదలైన తర్వాత ఒకే ఆస్థానాన్ని అంటిపెట్టుకొని, ఆ రాజుకే సేవ చేస్తూ ఉండే రోజులు పోయాయి. నూటపదహార్లు ఇచ్చే రాజులు నలుగురు ఉన్నారంటే నలుగురి దగ్గర వార్షికం తీసుకునే పద్ధతులు మొదలయ్యాయి. అంటే ఆర్థిక కారణాలు, ఆర్థిక ఆలోచనలు మెల్లమెల్లగా కవుల ఆలోచనలను ప్రభావితం చేశాయి. ఆ కారణంతోనే నానారాజ సందర్శనం జరిగింది. 'పృచ్ఛకులు బెత్తాయించిన విషయాల మీద అప్పటికప్పుడు, నిల్చున్న పళాన, కోరిన డిజైన్ల పద్యాలు చెప్పడం కొత్తరకం కవిత్వ వ్యాపారం' అని ఆరుద్ర అన్నారు. కవిత్వ వ్యాపారం అంటే కవిత్వ కర్మ అని అర్థం. కొత్త రకమైన ప్రక్రియ ఏం వచ్చిందంటే ఆశు కవిత్వంలో కోరినట్లు చెప్పాలి, అప్పటికప్పుడు చెప్పాలి. అంటే ఇది వరకు లేని శ్రమ కవులకు కొత్తగా వచ్చింది. ఇదివరకు ప్రశాంతంగా కూర్చొని కావ్యం రాసుకొని మరుసటి రోజు సభలోకి వచ్చి, రాజు ప్రశాంతంగా ఉన్నప్పుడు నాలుగు తాళపత్రాలను అలా తిప్పి ఆ రోజు రాసిన పద్యాల్ని వినిపించి, పండితులతో చర్చ జరిపేవారు. కానీ, ఆశు దశలోకి వచ్చేటప్పటికీ పృచ్ఛకులు ఎప్పటికప్పుడు కోరినటువంటి పద్యాలు చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. ఇది అవధానానికి ఒక నాందిగా మారింది.

> ఆరంభ దశలో సాహిత్యానికి సంబంధించినవి అవధానాల్లో ఏవేవి ఉన్నాయంటే, ఒకటి వ్యస్తాక్షరి, ఇంకొకటి అగ్రపద్యగ్రహణాభిరక్తి, మూడోది సమస్యాపూరణం. నిజానికి సమస్యాపూరణంతోనే అన్నీ మొదలయ్యాయి. అటు తర్వాత వ్యస్తాక్షరి వచ్చింది. తర్వాత కావ్య పఠనంలో అగ్ర పద్యం అంటే ముందు చదివినటువంటి పద్యం తర్వాత ఏ పద్యం వస్తుందో అవధాని చెప్పుకొంటూ వచ్చేవాడు. సహపాఠం కూడా వచ్చింది. తర్వాత సంఖ్యాలేఖనం, సంఖ్యాఖ్యానం, ఆ తర్వాత చతురంగం (చదరంగం ఆట) వంటి చమత్కార అంశాలు సాహిత్యేతరమైనవి కూడా మెల్లమెల్లగా అవధానంలోకి ప్రవేశించాయి.

1849లో పుదూరు సీతారామశాస్త్రి ఒక పెద్దబాల శిక్షను ప్రకటించారు. ఇది బహుశా మొట్టమొదటి పెద్దబాల శిక్ష. అందులో అవధానం గురించి ప్రస్తావించారు. చతురంగం, కవిత్వం, కవిత్వ లేఖనం, పఠనం, గణితం, సంగీతం, యుక్తి చెప్పడం, వ్యస్తాక్షరి అనే ఎనిమిదింటిని అష్టావధాన అంశాలుగా పేర్కొన్నారు. అటు తర్వాత అష్టావధాన అంశాలను స్పష్టంగా చెప్పిన వారు తిరుపతి వేంకట కవులు. 1892లో తిరుపతి వేంకట కవులు..

> శా. పౌరాణోక్తి కవిత్వ పుష్ప గణనావ్యస్తాక్షరుల్ లౌక్య గంభీరోక్త్యంచిత కావ్య పాఠన కళావిద్యాభాషణంబుల్ ముదంబారంగా చతురంగఖేలనము నీ యష్ట ప్రకారంబులో
> ప్పారున్ శంకర! ఏక కాలముననే యష్టావధానమ్మునన్!

అంటే కావ్య పాఠం, కవిత్వం,శాస్త్రార్థం, పురాణం, లౌకిక ప్రసంగం, వ్యస్తాక్షరి, చతురంగం, పుష్పగణనం అనే ఎనిమిది అంశాలను చెప్పారు. వీటిలో చతురంగం, పుష్పగణనం తప్ప మిగిలిన అన్నీ సాహిత్య సంబంధమైన అంశాలే. దేవులపల్లి సోదర కవులు అవధానంలో ఉద్దిష్టాక్షరి, నిర్దిష్టాక్షరి అనే రెండు కొత్త అంశాలను చేర్చారు. కాశీ కృష్ణాచార్యులు అశ్వప్లుతి, వారకథనం, ఆశుకథ అనే అంశాలను చేర్చారు. పిశుపాటి చిదంబర శాస్త్రి వివర్గాక్షరి, ఏకసంథాగ్రహణం అనే అంశాలను చేర్చారు. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి సహపఠనం, లిఖితాక్షరి అనే అంశాలను చేర్చారు.

1908లో వేంకట రామకృష్ణ కవులు నిషిద్ధాక్షరి, వ్యాకరణ ప్రసంగం అనే అంశాల్ని చేర్చారు. 1913కు వచ్చేటప్పటికీ నందగిరి శేషగిరిరావు గణితాన్ని అవధాన అంశాల్లో చేర్చారు. వీరేశలింగం అవధానంలో పేకాటను కూడా చేర్చారు. అజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు అవధానంలో ఆంగ్ల ఉపన్యాసాన్ని, మనోగణితాన్ని చేర్చారు. ఇట్లా అనేక అంశాలు చేరుస్తున్నప్పటికీ పృచ్ఛకుల సంఖ్య మాత్రం ఎనిమిదే. దాదాపు ముప్పై ఐదు అంశాల్లో అవధానులు వారివారి మానసిక స్థితికి అనుగుణంగా, వారికి ఉన్నటువంటి సాధనకు అనుగుణంగా, వారి శక్త్యానుసారం ఎనిమిది అంశాలను స్వీకరించేవారు. సభానుగుణంగా గజల్‌ను పాడితే దాన్ని పద్యంలో చెప్పడం లేదా పద్యాన్ని పాట రూపంలోకి మార్చడం వంటివి తర్వాత కాలంలో అవధానాల్లో చేరాయి. ఆ తర్వాత మృదంగం, హార్మోనియం కూడా చేరాయి. పండితుల కోసం మిగిలిన అంశాలు ఉండగా, అవధానాలకు వచ్చే సాధారణ ప్రజల కోసం ఘంటా గణనం, పుష్పగణనం, ఆకాశ పురాణం, కథ చెప్పడం, మనోగణితం మొదలైన అంశాలను స్వీకరించారు. ఇవి సాహిత్యేతర అంశాలే అయినప్పటికీ పృచ్ఛకులు అవధాని మీద ఉండే ప్రేమతో వ్యంగ్య ప్రసంగాలు, చమత్కార ప్రసంగాలు చేసే సంప్రదాయం కూడా అప్పుడే మొదలైంది.

అవధాని ఆ సందర్భాన్ని అనుసరించి వైజ్ఞానిక, శాస్త్రీయ విషయాలను ఉటంకిస్తూ సభారంజకం చేసేవారు. ఇప్పుడు అవధానాల్లో ప్రసంగాలు ఉండడం లేదు గానీ, పూర్వ కాలంలో అవధానాల్లో అవధాని చేసే ప్రసంగం కూడా ఒక ప్రధానమైన అంశమే. ఆ ప్రసంగం కాస్త ఇప్పుడు అప్రస్తుత ప్రసంగంగా మారింది. పూర్వపు రోజుల్లో అది శాస్త్రచర్చగా ఉండేది. శాస్త్రచర్చ ప్రారంభమైతే రెండు గంటల్లో అవధానం పూర్తి కావాలని గానీ, గంటన్నరలో అవధానం పూర్తి కావాలని గానీ, మూడు గంటల్లో అవధానం పూర్తి కావాలని గానీ నియమాలు లేకుండా ప్రశ్నకు సమాధానం దొరికేంత వరకు చర్చ కొనసాగే రోజులవి. ఇవన్నీ కలగలుపుగా ఉన్నప్పుడు అవధానసభ శాస్త్ర విజ్ఞానం, వినోదం.. వంటి వాటి సమాహార రూపమైన ఒక అద్భుతమైన పండిత సభగా భాసిల్లేది తొలినాళ్లలో. అటు తర్వాత అవధానాల్లో నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది, అప్రస్తుత ప్రసంగం ఈ నాలుగు తప్పనిసరి అంశాలయ్యాయి. నిషిద్ధాక్షరి, సమస్య, దత్తపది.. ధారణాంశాల్లో ప్రధానమైనటువంటివి. ఇక ధారణేతర అంశాల్లో కొంతమంది ఆశువును వదిలి, పాటలో, పద్యాలో పెట్టుకోవడం ఉన్నప్పటికీ కచ్చితంగా అప్రస్తుత ప్రసంగం లేని అవధాన సభ జరగడం లేదు. అది నియతమైపోయింది. అంటే ఒకప్పుడు శాస్త్రచర్చగా ఉన్న విషయం తర్వాత కాలంలో అప్రస్తుత ప్రసంగంగా, హాస్య ప్రసంగంగా, వెకిలి ప్రసంగాలుగా, ద్వంద్వార్థాలతో కూడా ఉండే స్థాయికి దిగజారడం శోచనీయం. ఇక తప్పనిసరిగా తీసుకోవాల్సిన నాలుగు అంశాలు కాకుండా వర్ణన, ఆశువు, న్యస్తాక్షరి, వ్యస్తాక్షరి, ఘంటాగణనం, ఛందోభాషణం, వారగణితం, యాంత్రిక గణితం, పురాణపఠనం, నామసమీకరణం, శ్లోకానువాదం, పేరడీ, పాటకు పద్యం మొదలైన అంశాల్లో ఏవో ఒక నాలుగు స్వీకరించేవారు. అట్లా మొత్తానికి ఎనిమిది అంశాలతో అవధానం నడుస్తూ ఉండేది.

> 1908లో వేంకట రామకృష్ణ కవులు నిషిద్ధాక్షరి, వ్యాకరణ ప్రసంగం అనే అంశాల్ని చేర్చారు. 1913కు వచ్చేటప్పటికీ నందగిరి శేషగిరిరావు గణితాన్ని అవధాన అంశాల్లో చేర్చారు. వీరేశలింగం అవధానంలో పేకాటను కూడా చేర్చారు. అజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసు అవధానంలో ఆంగ్ల ఉపన్యాసాన్ని, మనోగణితాన్ని చేర్చారు. ఇట్లా అనేక అంశాలు చేరుస్తున్నప్పటికీ పృచ్ఛకుల సంఖ్య మాత్రం ఎనిమిదే.

రాసుకోనటువంటి నియమం ఏమిటంటే కచ్చితంగా ఐదు ధారణాంశాలు అష్టావధానంలో ఉండితీరాలి. ఇది ఒక నియతిగా మొదటి నుంచి జరుగుతూ ఉన్న అంశం. అంతేగానీ, ధారణేతర అంశాలే ఆరు పెట్టుకొని రెండు మాత్రం ధారణాంశాలు పెట్టుకుంటామంటే కుదరదు. కచ్చితంగా ఐదు ధారణ అంశాలు ఉండాలి అనేది ఒక నియతిగా ఏర్పడింది. శతావధానాల్లో కూడా కచ్చితంగా మూడు ధారణాంశాలు, ఒక ధారణేతర అంశాన్ని ఎన్నుకొని 75 పద్యాలు అప్పజెప్పడం సంప్రదాయంగా మారింది. అలా కాకుండా 'మేము ఆశువులే 50 చెప్తాం. ఆ మిగిలినటువంటివి 12:12 చెప్తాం' అనడానికి వీల్లేదు. అవధానం వికాస దశకు వచ్చేటప్పటికీ ఒక స్పష్టత ఏర్పడింది. కచ్చితంగా ఈ అంశాలు ఉండాలి అని! ఆ స్పష్టత వల్ల తర్వాతి తరం అవధానులు హాయిగా అవధానాలు చేసుకుంటూ వెళ్లడానికి కావలసిన సిద్ధాన్నం సమకూరింది. మనం పద్యాన్ని నిలబెట్టుకోవడానికి, తద్వారా భాషను సంరక్షించుకోవడానికి ఒక ఆకరంగా అవధానం ఏర్పడింది. తద్వారా పద్యం తర్వాతి తరానికి కూడా అందుతుంది. భవిష్యత్తు తరాల వరకు భాష బతుకుతుంది.


**శతావధాని ఆముదాల మురళి**

---

**తెలుగు భాషాభిమానం లేని తెలుగు వాడు తెలుగోడు కాదు. మాతృ భాషాభిమానం అంటే ఇతర భాషలను, ముఖ్యంగా జాతీయ భాష హిందీపై గానీ, ఇంగ్లిష్‌పై గానీ ద్వేషం కాదు. ఇంగ్లిష్ విశ్వ విజ్ఞానానికి కిటికీ. దాన్ని మూస్తే మనమే చీకట్లో మగ్గుతాం. భాషాభిమానం దురభిమానంగా ముదరకూడదు. అందువల్ల, ఇంగ్లిష్ బోధనా పాఠశాలలను, రెండో భాషగా హిందీని వ్యతిరేకించకుండానే తెలుగును బతికించుకోవచ్చు. అమ్మ భాష కమ్మదనాన్ని కాపాడుకోవచ్చు. పిజ్జాలు, బర్గర్లు, బిర్యానీలూ ఎన్ని తిన్నా అమ్మ చేతి వంటకు సరిరావు కదా!**

# తెలుగులో పదాల కొరతా?

> మనం ప్రతిరోజూ ఇంట్లో, బయట మాట్లాడే దానిలో ఎంత తెలుగు ఉందో ఆలోచిస్తే తెలుగుకు పట్టిన తెగులు తెలుస్తుంది. మనం మాట్లాడే ప్రతి వాక్యంలో సగానికి పైగా ఇంగ్లిష్ పదాలు మనకు తెలియకుండానే అలవోకగా దొర్లుతాయి. రైలు, రోడ్డు (Road), సెల్‌ఫోన్ మొదలైన పదాలకు సరైన ప్రత్యామ్నాయ పదాలు (మారు పదాలు) లేవని నేను కూడా అనుకునే వాడిని. కానీ, దక్షిణకొరియా టీవీ సీరియళ్లు కొన్ని చూశాక మాతృభాషను ఇతర భాషా పదాలతో సంకరం చేయనవసరం లేకుండానే సుసంపన్నం చేసుకోవచ్చని తెలిసింది. వాళ్ల సీరియళ్లలో ఒక్క ఇంగ్లిష్ పదం పొరపాటున కూడా దొర్లడం నేను వినలేదు. ఫోన్‌లో కనీసం 'హలో' అనే పలకరింపు వారిలో లేదు. కొరియా భాషలో ఏదో అంటారు. బహుశా ఇంతటి భాషాభిమానం మన తమిళ తంబీలకు ఉన్నదేమో నాకు తెలియదు.




తెలుగు భాషకు ఈ దుస్థితి రావడానికి ప్రధాన కారణం మన పత్రికా రచయితలు, సినిమా రచయితలు, సీరియళ్ల రచయితలు, నవలా రచయితలు, కవులు తమ శక్తివంచన లేకుండా తెలుగు భాష అధోగతికి రెండువిధాలా కృషిచేశారు. మొదటిది.. విచ్చలవిడిగా ఇంగ్లిష్ పదాలను యథాతథంగా దిగుమతి చేశారు. బహుశా, ఇది చలం నుంచి ప్రారంభమైనది. ఇంగ్లిష్ పదాలను వాడటం శైలిగా (Style) మారింది. రెండోది... ఇతర భాషా పదాలను, ముఖ్యంగా సాంకేతిక (Technical), శాస్త్రీయ (Scientific) పదాలను తెలుగులోకి అనువదించకుండా వీరు సంస్కృతంలోకి అనువదించారు. అందువల్ల వీరు ఎంతగా సంస్కృతంలో ఏడ్చినా అవి వాడుకలో చెలామణి కాలేకపోయాయి. 'రైలు' అంటే 'ధూమ శకటం' అని ఎన్నిసార్లు చెప్పినా ఫలితం ఉండదు. కనీసం పొగబండి అని అచ్చ తెలుగులో చెప్తే అలవాటవుతుంది– అలా పలకడం నామోషీ అనుకోకపోతే! తెలుగు భాష మీద పట్టున్న రచయితలైతే శాస్త్ర, సాంకేతిక పదాలను కుడా చక్కని తెలుగులోకి అనువాదం చేయవచ్చు. ఉదాహరణకు– Comet అంటే 'ధూమకేతు' అని బండకొట్టుడు కొట్టే కంటే, చక్కగా 'తోకచుక్క' అంటే సరిపోలేదా? మన Milkyway galaxy (నక్షత్ర సముదాయం)ని 'పాలపుంత' అంటే ఎంత వినసొంపుగా ఉందో కదా! అందుచేత, రచయితలు, కవులు మన సొంత భాష వాడటానికి సిగ్గుపడకుండా ఇతర భాషా పదాలను అచ్చ తెలుగులోకి అనువాదం చేస్తే పలుకుబడిగా మారే అవకాశం ఉంది. చలనచిత్రాలు, టీవీ సీరియళ్లు, పత్రికలు ఇలాంటి తేట తెలుగు అనువాదాలను ప్రవేశపెడితే తెలుగుభాషను తెలుగుగా సుసంపన్నం చేసుకోగలం. అలా అని సంస్కృతం బొత్తిగా మానేయమని కాదు, అందరికి అర్థమయ్యే సంస్కృత పదాలున్నాయి. కానీ, మన భాషా పండితులు ఎంత బండ పదాలను వాడితే తాము అంత ఉద్దండులమనే గుడ్డి నమ్మకంతో జీవిస్తారు. చాలా ఇంగ్లిష్ పదాలను తెలుగు బాగా వచ్చినవారు చక్కగా తెలుగులో చెప్పవచ్చు. వాటిని తెలుగులో కాకుండా సంస్కృతంలో ఏడవడానికి ప్రయత్నించడం వల్లే 'అంతర్జాలం' (Internet) వంటి వింత జంతువులు (మార్జాలంలా) పుట్టుకువస్తాయి.

ఇది భాషా దారిద్ర్యం కాదు. భావ దారిద్ర్యం. మన ప్రయత్న లోపం. అందువల్ల, మన భాషను సుసంపన్నం చేసుకోవడమంటే గంపగుత్తగా ఇంగ్లిష్ పదాలను అరువు తెచ్చుకోవడం కాదని గ్రహించాలి. అయితే, హిందీ, ఉర్దూ, కన్నడ, తమిళ భాషా పదాలతో మన భాష సంకరమైనదనే వంకర వాదనతో ఏకీభవించను. మన దేశ భాషలతో కలిసిన తెలుగును పలకడానికి నామోషీ (ఉర్దూ పదం–సిగ్గు) ఎందుకు? మనం చేయవలసిందల్లా, ఇంగ్లిష్ పదాలు సాధ్యమైనంత తగ్గించి తెలుగులో మాట్లాడటమే. ఇది నాక్కూడా చాలా కష్టం. కనీసం ముందు తరాలకు ఇది సాధ్యపడాలంటే మన పాత్రికేయులు, రచయితలు, కవులు కృషిచేయాలి.

తెలుగు భాషను భ్రష్టు పట్టించడంలో దృశ్య, శ్రవణ మాధ్యమాల వ్యాఖ్యాతలు తమ శక్తివంచన లేకుండా కృషిచేశారు. ఒకరిద్దరు తప్ప, చాలామంది వ్యాఖ్యాతలు ముప్పాతిక వంతు ఆంగ్ల పదాలు వాడతారు. అక్కడక్కడా తెలుగు పదాలు దొర్లుతాయి. వారికి తెలుగు రాకపోవడం అందుకు కారణం. వారి తెలుగు ఉచ్చారణ ఆంగ్ల ఉచ్చారణను అనుకరించినట్టు ఉంటుంది. అందుకు ప్రధాన కారణం వాళ్లు కాన్వెంట్ పాఠశాలల్లో చదువుకోవడం. ఇంట్లో, బయట బట్లర్ ఇంగ్లిష్ మాట్లాడటం. (యు నో నా! You know na! అంటే నీకు తెలుసు కదా) కనీసం తెలుగులో బాలమిత్ర, చందమామ, బొమ్మరిల్లు వంటి కథల పుస్తకాలు, తెలుగులో రామాయణ, భారతం, భాగవతం, పంచతంత్ర, బుద్ధ జాతక కథలు, పలు వార్తా పత్రికలు చదివే అలవాటు వీరికి లేదు. ఇక ప్రాచీన తెలుగు కవుల గురించి, గురజాడ మొదలుకొని ఇప్పటి యండమూరి వరకు తెలుగు రచయితల సాహిత్య పరిచయం వీరికి శూన్యం.

> మన సినిమాల్లో, సీరియళ్లలో, టీవీ వ్యాఖ్యానాల్లో (anchoring) తెలుగు భాష ఆనవాళ్లు మాత్రమే కనిపిస్తాయి. తెలుగు భాషకు ఎంతగా తెగులు పట్టిందంటే... సామాన్యమైన తెలుగు పదాలను కూడా నేటితరం వారు అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇటీవల ఒక సినిమాలో 'గునపం ఇవ్వు' అని నాయకుడు అడిగితే, 'guna what?' అని నాయిక ప్రశ్నిస్తుంది. ఇదివరకు దెబ్బ తగిలితే అమ్మ, అబ్బా అని తెలియకుండానే అనేవాళ్లు. ఇప్పుడు 'షిట్' అనడం నాగరికం. అలా అలవాటు చేసుకున్నారు.

మళ్లీ తెలుగు భాష వెలగాలంటే, కనీసం 3వ తరగతి వరకు మాతృభాషలోనే అన్ని పాఠ్యాంశాలు ఉండాలి. 4వ తరగతి నుంచి అన్ని పాఠశాలలు ఆంగ్ల మాధ్యమంలో బోధించవచ్చు. ప్రతి ఇంట్లో అందరూ మాతృభాషలోనే మాట్లాడాలి. పాఠశాలలో, బయట వారి వారి ఇష్టం. పిల్లలకు తప్పనిసరిగా తెలుగు కథల పుస్తకాలు, తెలుగు సాహిత్యం కొంచెమైనా పరిచయం చేయాలి. తప్పనిసరిగా తెలుగు దినపత్రికలను ఇంగ్లిష్‌తో పాటు చదవడం అలవాటు చేయాలి. ముఖ్యంగా పత్రికా రచయితలు, కవులు పరభాషా పదాలను సులభమైన తెలుగులోకి అనువాదం చేయాలి. వాడుకలో ఇబ్బంది లేని సంస్కృతంలోకో, అచ్చ తెలుగులోకో అనువాదం చేస్తే, అది జనం నోళ్లలో నానుతుంది. పోతన, వేమన, అన్నమయ్యల పదాలు అందుకే పలుకుబడులుగా నిలిచాయి. అలా చేయగలిగితే తెలుగు భాష వెలుగుతుంది, మనగలుగుతుంది.


**ఆనందేశి నాగరాజు**
**98488 38323**

---

# తరువే నా గురువు



ఎక్కడో ఒక చోట
నిలకడే దాని అస్తిత్వం

పనిగట్టుకొని ఎవరికీ
ఎప్పుడూ ఏ పాఠం చెప్పదు

దాని ఆచరణ శీలతే
నేను నేర్చిన పాఠం

కొన్నికొన్ని సందర్భాలు
మనకంతగా అర్థం కావు

అది ఊగితే గాలొస్తుందా?
గాలొస్తే అది ఊగుతుందా?

నిలకడ సాధించనిది
తత్వం బోధపడదు

ఆకులు రాలుతున్నా
అది వగపు గీతాలాలపించదు

కాసిన కాయలపై రాయి విసిరినా
కసితో ప్రతి హింసకు పూనుకోదు

రాచి రంపాన పెట్టినా
నరికి కుప్పలు వేసినా కన్నెర్ర జేయదు

ఎన్ని సార్లు ధ్వంసం చేసినా
చిగురు దరహాసమే సమాధానం

పగవాడు అలసివచ్చినా
ఆతిథ్యంలో తేడా చూపదు
పక్షి, పాము, సీతాకోకచిలుక
ఏదైనా ఒకటే భుజాల మీద ఊరేగింపే

బోధి వృక్షం కింద కూర్చుంటే
బుద్ధొస్తుందా అంటే బుద్ధుడే సాక్షి!

ఉపకారం తప్ప ఏ అపకారం చేయకపోతేనే
చెట్టంత మనిషంటారు!


**కోట్ల వెంకటేశ్వరరెడ్డి**
**94402 33261**

---

# మోయలేని భారం



జలపాతాల కోసం
ఎక్కడికీ వెళ్లక్కర్లేదు
తమ లేత వీపులపై
పుస్తకాల భారం మోయలేని
లేగదూడల కళ్లల్లోకి చూస్తే చాలు

అయ్యో...
అంతలా ఉన్న ఆ గంధపుచెక్కను
ఇంతలా అరగ దీశారేం?
అది
ఈ పేదింటికి మంచి పెద్ద కొడుకండీ

కవిత్వం
తనకు తిండి పెట్టిన
ఆలోచనలు తలచుకుని
విశ్వాసంగా తోక ఊపుతోంది

రచయితను
నిద్రపోనివ్వని
వెతల నాగస్వరం చూసి
కథ పడగలా విచ్చుకుంది

పూజగదిలో
వెలిగించే అగరొత్తులు చూస్తుంటే
సన్నని పీల పేదలు
మనకు పరిమళం పంచేందుకు
తమ బతుకులు
త్యాగం చేస్తున్నట్లుంది!


**నలిమెల భాస్కర్**

---

**ప్రకటన**

## సాహిత్య సమావేశం

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో 2024 ఫిబ్రవరి 4న ఆదివారం ఉదయం 10.30 గంటలకు వర్తన సాహిత్య సంస్థ ప్రారంభ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో 'కవిత్వం–శిల్పం' అనే అంశంపై ప్రముఖ విమర్శకులు ఎం.నారాయణ శర్మ ప్రసంగిస్తారు. గుడిపాటి అధ్యక్షత వహిస్తారు. ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

## రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం

సాహిత్య రంగంలో ఉత్తమ కవితా సంపుటాలకు ఏటా ఇచ్చే 'రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారం–2023'కు వంశీకృష్ణ రచించిన 'రెప్పవాలని రాత్రి' ఎంపికైంది. 2024 మార్చిలో జరగనున్న కార్యక్రమంలో విజేతకు పురస్కారం అందజేయనున్నట్టు ట్రస్టు అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు.